క్లుప్తంగా

బాధితకుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం పంచాయతీ మాజీ ఎంపీటీసీ మణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం

పాలసముద్రం: మండలంలోని దినమందుపురంలోని వైఎస్సార్ నాయకుడు మగిమదాస్ తల్లి, జెడ్పీటీసీ సభ్యుడు అక్క తిలోర్‌మణి, గంగమాంబపురం ఆదిఆంధ్రవాడలో కన్నన్ హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి పార్టీ కార్యకర్తలతో కలసి శుక్రవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసి యాదవ్, పోలయ్య, చంద్రశేఖర్‌రాజు, షణ్ముగరెడ్డి, రాజామణి, చందర్, ముసాక్ తదితర నాయకులు పాల్గొన్నారు.


అనుమానాస్పద మృతిపై ధర్నా

గంగాధరనెల్లూరు: మండలంలోని వింజం గ్రామానికి చెందిన ధనుష్(19) రెండు రోజుల క్రితం అనుమానాస్పదంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిది ఆత్మహత్య కాదని, హత్యేనని ఆరోపిస్తూ మృతుని బంధువులు శుక్రవారం మృతదేహంతో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నివేదిక రాగానే విచారణ చేపడుతామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఆపై మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

వాహనం ఢీ: వ్యక్తికి గాయాలు

శ్రీరంగరాజపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని పోస్టుమాస్టర్‌కు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి నెళవాయి వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని శెట్టివానత్తంకు చెందిన పోస్టుమాస్టర్ మేఘనాథరెడ్డి(55) సొంత పనుల నిమిత్తం తమిళనాడులోని పళ్లిపట్టుకు దిచక్రవాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నెళవాయి వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొనడంతో ఆయన కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేటు వాహనంలో ఆయన్ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెవుటి గంగమ్మకు పాలాభిషేకం



పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగలోని చెవుటి గంగమ్మకు శుక్రవారం పాలాభిషేకం, అంబలి సమర్పణ కోలాహలంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు నవగ్రహ హోమం, శాంతి హోమం చేశారు. హోమ కలశపు నీటితో అమ్మవారిని అభిషేకించారు. 10 గంటలకు ప్రతి ఇంటి నుండి మహిళలు అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో నయ్యాడి వాయిద్యాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని అభిషేకించడానికి వచ్చిన మహిళలతో కిక్కిరిసింది. అభిషేకాల అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నాడు నేల చదువులు..
నేడు కార్పొరేట్ వసతులు

ప్రభుత్వ పాఠశాల అంటే గుర్తొచ్చేవి.. శిథిలమైన పైకప్పు.. బీటలు వారిన గోడలు.. ప్రహరీ లేని పాడుబడిన భవనాలు.. కానరాని ఫర్నిచర్.. నేల చదువులు.. నిరుపేదలు తప్ప ఎవరూ ఆ పాఠశాల వైపు చూసేవారు కూడా కాదు. మరి కొన్ని చోట్ల రాత్రి అయితే అసాంఘిక కార్యకలాపాలు జరిగేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వం బడులను గుడులుగా భావించి, వాటిని రూపురేఖలు మార్చడానికి శ్రీకారం చుట్టింది. భవనాలు, మరమ్మతులు, రంగులు, డెస్కులు, టైల్స్, పచ్చదనం, డిజిటల్ బోర్డులు, కొళాయిలు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించింది. శిథిలావస్థ నుంచి కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చింది.

- కార్పొరేట్ స్థాయికి పాఠశాలలు
- పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు
- గత పాలనలో శిథిలావస్థకు చేరిన బడులు


ఏకాంబరకుప్పం జడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ బోర్డులో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

పాఠశాలల వివరాలు		
మండంలోని ఉన్నత పాఠశాలలు	:	12
ప్రాథమికోన్నత పాఠశాలలు	:	7
ప్రాథమిక పాఠశాలలు	:	69
నాడు నేడు కోసం చేసిన ఖర్చు	:	రూ. 20.28 కోట్లు
విద్యార్థుల సంఖ్య	:	7926
ఉపాధ్యాయుల సంఖ్య	:	417

నగరి: గతంలో ప్రభుత్వ పాఠశాలలంటే పైకప్పు శిథిలమై, గోడలు బీటలు, సరైన మరుగుదొడ్డి వసతులు లేకుండా ఉండేవి. ఫర్నిచర్ కూడా లేక విద్యార్థులు నేలపై కూర్చుని విద్యాభ్యాసం చేసేవారు. ప్రహరీ గోడలు ఉండేవికావు అలా ఉన్నా అవి బీటలు తీసి శిథిలావస్థలో ఏ క్షణాన కూలిపోతాయో అన్నట్లుండేవి. పాఠశాల గదుల్లో పైకప్పు ఊడిపడిన సంఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పుణ్యమా అంటూ కనీస వసతులకు కూడా నోచుకోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. బడులన్నీ చదువులతల్లికి నిర్మించిన అందమైన గుడుల్లా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకంలో ప్రతి పాఠశాల కొత్త రూపును సంతరించుకుంది. చిన్నారుల మనసుదోచేలా ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులు రూపుదిద్దుకున్నాయి. పాఠశాల గదిలోకి విద్యార్థులు వెళ్లగానే ఆహా అనిపించేలా మారిపోయాయి. గదిలో విద్యార్థుల ఆలోచనలను రేకెత్తించేలా చిత్రాలను తీర్చిదిద్దారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కార్పొరేట్‌కు పాఠశాలలను మించేలా ప్రభుత్వ బడులకు వసతులు సమకూరాయి. అధునాతన విద్యుత్ బల్బులు, ఫ్యాన్లు, నల్లబోర్డు, తాగునీరు రాని చిలుంపట్టిన కొళాయి, పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలు కనుమరుగయ్యాయి. టైల్స్‌తో కళకళలాడే పాఠశాల గది, అత్యాధునిక బెంచీలు, డిజిటల్ బోర్డులు, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటు అంటూ విద్యా విధానంలో ఓ విప్లవం వచ్చింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మన బడి నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేశారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు విద్యాకానుక పేరిట బ్యాగు, బూట్లు, సాక్సు, నోటుపుస్తకాలు, బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిషు డిక్షనరీ, వర్క్ బుక్స్, యూనిఫాం, బెల్ట్ అందిస్తున్నారు. మధ్యాహ్నం గోరుముద్ద పేరుతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. రోజుకో మెనూ అమలు చేస్తున్నారు. వారానికి ఐదు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావ అందజేస్తున్నారు. విద్యార్థులకు ఆధునిక మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దివ్యాంగులైన పిల్లల సౌకర్యార్థం వెస్టర్న్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధన జరుగుతోంది. ట్యాబ్‌లు అందజేసి బైజూస్ కంటెంట్‌తో విద్యను బోధిస్తున్నారు.


ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల


పీసీఎన్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం


నాడు: మూలనత్తం పాఠశాల..


నేడు: కళకళలాడుతున్న మూలనత్తం పాఠశాల


నాడు: సత్రవాడ ప్రాథమిక పాఠశాల,


నేడు: నవీకరించిన సత్రవాడలోని పాఠశాల



ఎం.కొత్తూరు పాఠశాలలో బైజూస్ ట్యాబ్‌ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు, ప్యూరిఫైడ్ వాటర్ పట్టుకుంటున్న విద్యార్థులు



ఎం.కొత్తూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపేట పాఠశాలలో ఆధునిక మరుగుదొడ్లు

అభివృద్ధిని చూసి ఫ్యాను గుర్తుకు ఓటేయండి


ఎన్నికల ప్రచారంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నింద్ర: రాష్ట్రంలో చేపట్టిన వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరామాపురంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే సాధ్యమన్నారు. మహిళలకు, బీసీలకు అన్ని వర్గాల ప్రజలను ఆదరించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. ఈ అభివృద్ధి మరింత మెరుగు పడాలంటే తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని, నగరిలో రోజమ్మను తిరిగి గెలిపించాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా పార్టీ కార్యదర్శి మేరి, సింగిల్ విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ విజేష్, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, మాజీ సర్పంచ్ నాదమునస్వామి, మహేష్, కో–ఆప్షన్ సభ్యులు అనిల్, మండలంలోని నాయకులు దామోదరం, రామచంద్రయ్య, సత్యరాజ్, దినకరన్ పాల్గొన్నారు.

జగనన్నకు మరోసారి పట్టం కడదాం

పుత్తూరు: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా పట్టం కడదామని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుత్తూరు రూరల్ మండలం తొరూరు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని చెప్పారు. నేడు జగనన్న ఐదేళ్ల పాలనలో అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు రావడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తున్నారని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకొని ప్రచారం నిర్వహిస్తోందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. 14 ఏళ్ల పాలనలో మంచి చేయలేని చంద్రబాబు, నేడు ఎలా చేస్తారంటూ ప్రజలే ప్రశ్నించాలని కోరారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందస్వామి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుదర్శనం, లక్ష్మణమూర్తి, రామ్‌బత్తయ్య, మునిరత్నం పాల్గొన్నారు.

యువతను తప్పుదోవ పట్టించే పార్టీకి గుడ్‌బై

- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువత
- కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి ఆర్కేరోజా


పార్టీలో చేరిన నాయకులతో మంత్రి ఆర్కేరోజా

నగరి: నియోజకవర్గంలోని విజయపురం మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు యువతను తప్పుదోవ పట్టించే పార్టీలో ఉండలేమంటూ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కార్యాలయం వద్దకు శుక్రవారం విచ్చేసిన శ్రీహరిపురం మాజీ సర్పంచ్ గోవిందరాజులు, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు నాని, వెంటేశులు, కిషోర్, ధనరాజు, ఆకాష్, నాగరాజు, అవినాష్, ప్రేమ్‌కుమార్ వీరితో పాటు వారి అనుచరులు 60 మంది మంత్రి ఆర్కేరోజా సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పార్టీ కండువాలు వారికి వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఒక వ్యక్తిని ఎదుర్కోవడానికి టీడీపీ అధినేత బీజేపీ, జనసేనలతో కూటమిగా వెళ్లడంతో పాటు ప్రతి సభలోను షర్మిలకు అనుకూలంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీని కూడా పరోక్షంగా కలుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇది జగన్‌మోహన్ రెడ్డిని చూసి ఆయన ఎంతగా భయపడుతున్నాడో తెలియజేస్తోందన్నారు. రాష్ట్రంలో జగనన్న, నగరిలో రోజమ్మ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వివరించారు. ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తిరుగులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోపి, శ్రీహరిపురం సర్పంచ్ రగేష్, పార్టీ నాయకులు హరి, తిరుపాల్, గిరి, గుణశేఖర్ రెడ్డి, భాస్కర్, కుమార్, రవి, బుల్లయ్య, పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరు కుటుంబంతోనే మా పయనం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుటుంబంతోనే తమ పయనం సాగుతుందని జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్ అన్నారు. గురువారం పెనుమూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో కలసి ఆయన మాట్లాడారు. కళత్తూరు కుటుంబానికి, పెనుమూరు మండలానికి విడదీయరాని బంధం ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రిగా పెనుమూరు మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, అలాంటి కుటుంబం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న కళత్తూరు కృపాలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించే బాధ్యత పెనుమూరు మండలం నాయకులపై ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బడుగు బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన పేదవారికి కూడా సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారని, అలాంటి సంక్షేమ సారథిని మరోసారి సీఎంగా చూడటమే లక్ష్యంగా అందరూ కృషి చేస్తామన్నారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు. కృపాలక్ష్మి విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నీలా పండరినాథ్, జిల్లా యువజన కార్యదర్శి దూది మునేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామయ్య, నాయకులు కలికిరి మురళి పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకే మళ్లీ ఓటేద్దాం..


ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి

నింద్ర: మండలంలో ఓటర్లందరూ మళీఫ్యాను గుర్తుకే ఓటేసి జగనన్నకు గెలిపించుకుంచుకుందామని నగరి నియోజకవర్గం పార్టీ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పట్టెడ గ్రామంలో మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని చెప్పారు. అన్న వర్గాల వరకు సమాన ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే నని స్పష్టం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుబా, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కో ఆప్షన్ సభ్యులు అనిల్, జిల్లా పార్టీ కార్యదర్శి మేరి, మహేష్, నాదమునస్వామి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కరుణామయుని బాటలో పయనిద్దాం

కార్వేటినగరం: స్థానిక బీసీ కాలనీలోని బేతేల్ షారోన్ చర్చి, పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న యెహోవా ఈరే చర్చిలో శుక్రవారం ఉపవాస దీక్షలతో గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. పాస్టర్లు ఆశీర్వాదం, అగస్టీన్ సరోజినీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా ఏసుక్రీస్తు శిలువపై పలికి ఏడు మాటల గురించి ప్రత్యేకంగా వాక్య ప్రసంగాలు చేశారు. అలాగే పాదిరికుప్పం, అల్లాగుంట, కొల్లాగుంట సీఎస్ఐ, టీకేఎం పేట, గోపిశెట్టిపల్లె, కొటార్వేడు, గాజంకి, యర్రమరాజుపల్లె, కత్తెరపల్లె, గ్రామాల్లోని చర్చిల్లో కూడా ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువ వేయబడిన సమయానికి గుర్తుగా చర్చి గంటలు మోగించి మౌనం పాటించారు. పళ్లరసాలు స్వీకరించి ఉపవాస దీక్షలు విరమించారు. కార్యక్రమంలో పలువురు మతబోధకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

నగరి: మున్సిపల్, మండల ప్రాంతాల్లోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువపై మరణించే ముందురోజు గురువారం రాత్రి రోమన్ సైనికులకు పట్టుబడతారు. ఆ రాత్రే ఆయన ఆఖరి భోజనం చేస్తారు. దాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేయగా చర్చిల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. క్రైస్తవులు ఉపవాస దీక్షతో ప్రార్థనలు చేశారు. ఫిబ్రవరి 14వ తేదీన ప్రారంభమైన క్రైస్తవుల తపస్సు కాలం శనివారంతో ముగుస్తుంది.

ఉపవాస0 దీక్షల విరమణ

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం, వీర్లగుడి, రంగాపురం, దీనబంధుపురం శ్రీకావేరి రాజుపురం, ఆముదాలలోని చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. దీన బంధుపురం చర్చిలో పాస్టర్ పాల్ రాజ్ వాక్య సందేశమిచ్చారు. మధ్యాహ్నం క్రైస్తవులు ఉపవాస దీక్షలు విరమించారు.

వెదురుకుప్పం: మండలంలో దేవరగుడిపల్లెలోని సీఎస్ఐ మాథ్యూస్ చర్చిలో రెవరెండ్ అన్బుదాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తును శిలువ వేసిన ఘట్టాన్ని గుర్తు చేస్తూ, ఆయన్ను స్తుతిస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్బుదాస్ యేసుక్రీస్తు శిలువలో పలికిన మాటల గురించి వాక్య సందేశమిచ్చారు. సంఘ ఉపదేశకులు, మిషనరీలు, సెక్రటరీలు, ట్రెజరర్, యువత పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు మండలంలో..

గంగాధర నెల్లూరు: మండలంలోని క్రైస్తవులు శుక్రవారం ఉపవాస దీక్షలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ సురేష్ వాక్య సందేశమిచ్చారు. యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, దయ, క్షమా గుణాలతో యువత ముందుకుపోవాలన్నారు. తొలుత చిన్నారులు, యువకులు, పెద్దలు శిలువను మోస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. సీఎస్ఐ చర్చి సంఘం అధ్యక్షులు ఆర్ గుణశేఖర్, గ్రామ పెద్ద రామచంద్రన్, స్థానిక ఉపదేశకులు సగాయం, ఉపదేశకులు రఘుబాబు, రవి, పీసీ సభ్యులు జాన్ వెంకటస్వామి, జగన్ బాబు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.




కార్వేటినగరం: బేతేల్ షారోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు, వెదురుకుప్పంలో..., గంగాధర నెల్లూరులో శిలువతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు